ప్రజాశక్తి
మంగళవారం 31 డిసెంబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు



పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

జిల్లా ఖజానా, లెక్కల అధికారి ప్రసాద్‌బాబు

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలో ప్రభుత్వ పెన్షనుదారులు 2025 సంవత్సరానికి గాను జనవరి 1 నుండి ఫిబ్రవరి 28 తేదీలోపు లైఫ్ సర్టిఫికెట్ ను డిజిటల్ పద్ధతిలో జీవన్ ప్రమాణ పోర్టల్ ద్వారా సమర్పించాలని జిల్లా ఖజానా, లెక్కల అధికారి ఆర్. ప్రసాద్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో గల ఆరు ఉప ఖజానా కార్యాలయాలలో (పాడేరు, చింతపల్లి, అరకు, అడ్డతీగల, రంపచోడవరం, చింతూరు) ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పెన్షన్ దారులు ఆధార్ కార్డు, సెల్ ఫోన్ (ఓ.టి.పి.కు), తదితర వివరములు తీసుకొని దగ్గరలో ఖజానా కార్యాలయానకు వెళ్లి లైఫ్ సర్టిఫికెట్ నమోదు చేసుకోవాలన్నారు. లేదా దగ్గరలో గల మీసేవ కేంద్రం, నెట్ సెంటర్లలో లైఫ్ సర్టిఫికెట్లు నమోదు చేసుకోవచ్చని ఆయన వివరించారు. తగు సమాచారం నిమిత్తము జిల్లా ఖజానా, లెక్కల కార్యాలయంలో హెల్ప్ డెస్క్ కూడా ఏర్పాటు చేసామన్నారు.

అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు



పాడేరులో నిరసన చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి-పాడేరు: భారత రాజ్యాంగ రూపకర్త బిఆర్ అంబేదకర్ పై రాజ్యసభలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను బర్తరప్ చేయాలని దేశవ్యాప్త నిరసనలో భాగంగా సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో పాడేరు జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద అంబేద్కర్ సెంటర్ ఆవరణలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎల్ సుందరరావు, పి.లక్కు, సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు. రాధాకృష్ణ మాట్లాడుతూ, పేదల, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, గొప్ప మేధావి అంబేద్కర్‌పై అమిత్ షా అవమానకరంగా మాట్లాడడం హేయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు చిన్నారావు, దాస్, రాజు, సూరిబాబు, కొండబాబు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ను మంత్రి వర్గం నుండి సస్పెండ్ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు అన్నారు. మండల కేంద్రంలోని నాలుగు రోడ్డు జంక్షన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ, బిజెపి రహస్య ఎజెండా హెూం మంత్రి అమిత్ షా ద్వారా బయటపడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మండల నాయకులు పి బాలదేవ్, జి బుజ్జి బాబు,కే మగ్గన్న, కె జగన్నాథం, కె బుజ్జి బాబు,పి రామన్న,టి హరి, పి బాలకృష్ణ, జి.కోగేశ్వరరావు పాల్గొన్నారు.

పెదబయలు :మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ నుండి అంబేద్కర్ కూడలి వరకు సిపిఎం నేతలు రాలీ చేపట్టారు. సిపిఎం మండల కార్యదర్శి బొండా సన్నిబాబు మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని సమూలంగా మార్చాలని చూస్తోందన్నారు.ఉద్దేశపూర్వకంగానే ఇటువంటి వాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు, ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగెని ధర్మన్న పడాల్, సిపిఎం మండల కమిటీ సభ్యులు కిలో సర్బన్న, గంగాధరం, జంపరంగి సునీల్ కుమార్, కొర్ర నీలకంఠం, రామారావు పాల్గొన్నారు.



చింతూరులో...

హెూమంత్రి వ్యాకలపై సీపీఎం నిరసన

అనంతగిరి: మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఎం నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జడ్పీటీసీ దీసరి గంగరాజు, పార్టీ మండల కార్యదర్శి కిల్లో మోస్యలు మాట్లాడుతూ, అమిత్ షా నైతిక బాధ్యత వహించి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దళితులు, గిరిజనులు, మైనార్టీలు ముందుకు వచ్చి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సోమెల నాగులు, వేంగడ మాజీ సర్పంచ్ సివేరి. కొండలరావు, వెంకటరమణ, గంగులు, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయం నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీనీ మండల కార్యదర్శి కొర్ర త్రినాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. త్రినాధ్ మాట్లాడుతూ, అమిత్ షా రాజీనామా చేయాలనీ, లేనిపక్షంలో ప్రధాని నరేంద్ర మోడీ బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎస్ గాసిరం దొర, ఎంఎం శ్రీను, జి నారాయణ, పి రామదాసు, కె శంకర్‌రావు, ధనుర్జయ్, ఎస్ ఈశ్వరి, బాలు పాల్గొన్నారు.

హుకుంపేట:అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలపై మండల కేంద్రంలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సీపీఎం మండల కార్యదర్శి, మాజీ సర్పంచ్ వలసనైని లక్ష్మణ్‌రావు, జిల్లా నాయకురాలు సొంటేన హైమావతి, వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, నాయకులు అప్పల కొండ పడాల్, కృష్ణారావు, ఆనంద్, పార్వతి పాల్గొన్నారు.



అనంతగిరిలో...

రాజవొమ్మంగి:రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లోతా రామారావు మాట్లాడుతూ అంబేద్కర్ కేవలం ఒక సామాజిక వర్గానికే కాదు, యావత్తు భారతదేశానికి మహెూన్నత వ్యక్తి, అటువంటి అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. సిపిఎం మండల కార్యదర్శి కొండ్ల సూరిబాబు, నాయకులు పి.పాపారావు, టి.శ్రీను, రామరాజు, సింగిరెడ్డి అచ్చారావు, బుడమ బాబురావు, కుంజం జగన్నాథం పాల్గొన్నారు.

కూనవరం : మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయం నుండి టేకులబోరు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, అమిత్‌షాకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం అక్కడున్న అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నాయకులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, సర్పంచులు మడకం నాగమణి, శంకర్, బొగ్గా రామారావు, సీనియర్ నాయకులు తలగాని నాగరాజు, నోముల సత్యనారాయణ, షణ్ముకేశ్వరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, కర్నాటి శ్రీనివాసరావు, బాబురావు ధన్నూరి శ్రీనివాసరావు, కొండా ఈశ్వర్లు, పొద్దయ్య పాల్గొన్నారు.



అరకులోయలో మాట్లాడుతున్న నాయకులు

విఆర్.పురం : కేంద్ర మంత్రి అమిత్ షాను వెంటనే క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని రేఖపల్లి జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. అక్కడ నుండి ర్యాలీగా అంబేద్కర్ విగ్రహం దగ్గరకు వెళ్లి అంబేద్కర్ విగ్రమానికి పూలమాలలు వేసి వినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, ఎంపీపీ కారం లక్ష్మి, ప్రజా ప్రతినిధులు పూనెం సరోజినీ, వెట్టి లక్ష్మి, సవలం మారయ్య, మండల నాయకులు పంకు సత్తిబాబు, పోడియం శ్రీరామ్‌మూర్తి, వడ్లది రమేష్, కారం సుందరయ్య, చీరపు తాతబాబు, కే సత్యనారాయణ పాల్గొన్నారు.

చింతూరు : చింతూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌పై అమిత్ షా అహంకార పూరత, అవమానకరంగా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు సీసం సురేష్, పొడియం లక్ష్మణ్, మొట్టుమ్ రాజయ్య, ఎంపీటీసీ వేక రాజ్ కుమార్, మాజీ జెడ్పిటిసి ముర్‌న్ రంగమ్మ, కారం సుబ్బారావు, కారం నగేష్, మడకం చిన్నయ్య, సవలం కన్నయ్య, పట్రా రమేష్, తెప్పల లక్ష్మయ్య, పల్లపు పెద్ద రాములు పాల్గొన్నారు.

ఎటపాక : అమిత్ షా రాజీనామా చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని తోటపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కాకా అర్జున్ దొర, నాయకులు తోట శ్రీనివాస్, గాడిద ముక్కోటేశ్వరరావు, అప్పారావు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని రాజేంద్రపాలెం గిరిజన భవన్ వద్ద ఆదివాసి జెఎసి ఆధ్వర్యంలో రాజ్యాంగ సదస్సు నిర్వహించారు. అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు.జెఎసి నాయకులు ఎస్.అశోక్, లాల్, రిటైర్డ్ ఉద్యోగి నర్సి పాపారావు, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎస్.సూరిబాబు, బూరుగు వెంకటరావు పాల్గొన్నారు.



విఆర్ పురంలో...



ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నందు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి కొయ్యూరు

మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌కెఎస్.నందు సోమవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ధాన్యం తేమ శాతం, ధాన్యం తూనికలను పరిశీలించారు. రైతులకు పలు రకాల సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 391 టన్నుల ధాన్యాన్ని ఈ కేంద్రంల ద్వారా కొనుగోలు చేసినట్లు చెప్పారు. రైతులు తమ పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. జీడి పిక్కల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా రైతులు జిల్లా వ్యవసాయ అధికారికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఉమాదేవి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో సిఆర్పిఎఫ్ పోలీసు బలగాలతో ఎస్సై రవీంద్ర సోమవారం ఉదయం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో ముగ్గురు మహిళా మావోయిస్టులను ఒరిస్సా పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో పోలీసులు మావోయిస్టుల కదిలికిలపై నిఘా పెట్టారు. అలాగే న్యూ ఇయర్ జనవరి 1, సంక్రాంతి పండుగ సమీపిస్తుండడంతో ఇదే అదునుగా భావించి స్మగ్లర్లు గంజాయి అక్రమ రవాణాకు పాల్పడే అవకాశం ఎక్కువగా ఉందని పోలీసులు భావించి అణువణువునా గాలింపు చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారి ఐటిఐ జంక్షన్ వద్ద పోలీసులు కాపు కాసి ఆంధ్ర ఒరిస్సా తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను నిలిపివేసి తనిఖీలు చేశారు. వ్యక్తులు ఆధార కార్డు, ఇతర వివరాలు సేకరించి విడిచిపెట్టారు. ఏపీ జెన్కో చెక్ పోస్ట్ పోస్ట్ ఆఫీస్ తదితర ముఖ్య కుడళ్ళులలో పోలీసులు త్రిష్ట వేసి వాహన తనిఖీ చేపట్టారు.



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

విద్యార్థినిపై సామూహిక అత్యాచారం అవాస్తవం

- జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: జి.మాడుగుల మండలం గాంధీనగర్ ఆశ్రమ పాటశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిందని మీడియాలో వస్తున్న కథనాలను జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో ఖండించారు. ఈ నెల 25న విద్యార్థిని తండ్రి నూతన వస్త్రాలు కొనుగోలుకు బయటకు తీసుకువెళ్ళి సాయంత్రం పాఠశాల వద్ద దింపేసి వెళ్లిపోయారన్నారు. అదే సమయంలో ఆ విద్యార్థిని తిరిగి బయటకు వెళ్ళినట్లు సిసి టివి పుటేజ్ ద్వారా గుర్తించడం జరిగిందని తెలిపారు. ఆ విద్యార్థినికి కొర్ర మల్లేశ్వర రావు (22) అనే వ్యక్తితో ప్రేమ వ్యవహారం ఉన్నట్లు ఆమె తల్లిదండ్రులకు కూడా తెలుసునని, ఆమె తెలియజేసినట్లు పేర్కొన్నారు. బయటకు వెళ్ళిన ఆ విద్యార్థిని 27న గడుతూరు లోని ఆమె బంధువుల ఇంట్లో ఉన్నట్లు గుర్తించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆమెను పోలీసు స్టేషన్‌కు అప్పగించడం జరిగిందన్నారు. నిందితుడు మల్లేశ్వరరావుతో పాటు ఆటోలో విద్యార్థిని తీసుకు వెళ్లేందుకు సహకరించిన మరో ఇద్దరిపై పోక్సో కేసు నమోదు చేయడం జరిగిందని కలెక్టర్ వివరించారు. ఈ నేపథ్యంలో శాఖాపరమైన విచారణకు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్. రజనీని ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు.



మాట్లాడుతున్న గంగరాజు

మాతా శిశు మరణాలను అరికట్టాలి

-జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని మాతా శిశు మరణాలు అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని స్థానిక జెడ్పిటిసి దీసరి గంగరాజు తెలిపారు. పొర్నపొదర్ గ్రామంలో ఆయన సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాతా శిశు మరణాలు అరికట్టేందుకు అధ్యయనంతో కూడిన మెడికల్ బృందం కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను ఫోను ద్వారా కోరడం జరిగిందన్నారు. మండలంలోని ఎగువశోభ పంచాయితీ పొర్నపొదర్ గ్రామనికి చెందిన పాంగి దాసుకు జన్మించిన నాలుగు నెలల శిశువుతో పాటు అదే కుటుంబానికి చెందిన నలుగురు శిశువులు వరసగా మృతి చెందారన్నారు. రెండు మూడు సంవత్సరాల నుండి సుమారు 14 మంది శిశువులు క్రమం తప్పకుండా మృతి చెందుతూనే ఉన్నారన్నారు. ఒక గ్రామంలోనే ఇన్ని మరణాలు ఉన్నాయంటే మండలంలో ఎన్ని మరణాలు జరిగి ఉంటాయా అనేది వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలియజేయాలన్నారు. మాతా శిశు మరణాలను తగ్గించేందుకు వైద్య సేవలు కల్పిస్తున్నట్లు ప్రభుత్వం పత్రిక ప్రకటనలు గుప్పించడం తప్ప క్షేత్ర స్థాయిలో ఇటువంటి ఘటనలు పునరావృతం అమవుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం మాతా శిశు మరణాలు అరికట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతీ సర్పంచ్ కొర్ర. సింహాద్రి, సిపిఎం నాయకులు ఎస్. నాగులు, టోకూరు సర్పంచ్ కిల్లో మొస్య, గ్రామస్తులు సొంటరి కుమార్, సాగర. సన్యాసి తదితరులు పాల్గొన్నారు.

ప్రసవ సమయంలో వైద్యం అందక నిండు గర్భిణి మృతి

- ★ ఏరియా ఆసుపత్రిలో అందుబాటులో లేని వైద్యులు
- ★ డాక్టర్ల నిర్లక్ష్యంపై కుటుంబీకుల ఆందోళన
- ★ విచారణకు సబ్ కలెక్టర్‌ను ఆదేశించిన ఐటిడిఎ పిఒ



గర్భిణీ తెల్లం లక్ష్మి మృతదేహం

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో ప్రసవ సమయంలో వైద్యులు అందుబాటులో లేక, సకాలంలో వైద్యం అందక నిండు గర్భిణి తెల్లం లక్ష్మి మృతి చెందిన సంఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మృతురాలి భర్త తెల్లం వెంకన్న దొర తెలిపిన వివరాలు ప్రకారం... రంపచోడవరం మండలం అకూరు పంచాయతీ పరిధి కొయ్యలగూడెం గ్రామానికి చెందిన నిండు గర్భిణి తెల్లం లక్ష్మిని డిసెంబర్ 19వ తేదీన ముందస్తుగా ప్రసవం కోసం ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు ఆమెను సబ్ కలెక్టర్ కార్యాలయ సమీపంలో ఉన్న బర్త్ వెయిటింగ్ హోమ్‌లో ఉంచారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత సుమారు ఒంటి గంటన్నర సమయంలో లక్ష్మికి పురిటి నొప్పులు రావడంతో అక్కడ నుండి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే ఆ సమయంలో ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్ ఎవరూ అందుబాటులో లేరు. విధులలో ఉన్న నర్సులు ప్రసవం చేయించే ప్రయత్నం చేస్తుండగా లక్ష్మి మృతి చెందారు.

కుటుంబీకుల ఆందోళన

తెల్లం లక్ష్మి మృతిపై ఆమె బంధువులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మృతురాలి భర్త వెంకన్న దొర మాట్లాడుతూ తన భార్య లక్ష్మి మృతికి వైద్యులే కారణమని ఆరోపించారు. ఆసుపత్రిలో ఇద్దరు గైనకాలజీ డాక్టర్లు



ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

ఉన్నప్పటికీ రాత్రి సమయంలో వారు ఒక్కరూ అందుబాటులో లేరని, డ్యూటీలో ఉన్న చిన్నపిల్లలు డాక్టర్ కూడా ఆసుపత్రిలో ఆ సమయంలో లేరని తెలిపారు. ప్రసవంలో ఇబ్బందులు వస్తే సంబంధిత గైనికాలజీ డాక్టర్లు అయితేనే ఆపరేషన్ చేయగలరని, ఇద్దరిలో ఒక్క గైనికాలిజిస్ట్ అయినా అందుబాటులో ఉంటే తన భార్య మృతి చెందేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని మృతురాలి బంధువులు కోరారు.

ఆర్ఎంఒ వివరణ

దీనిపై ఆర్ఎంఒ డాక్టర్ ఇందిరా మాట్లాడుతూ మృతి చెందిన తెల్లం లక్ష్మి పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని, ఆమె ఎటువంటి హైరిస్క్ పేషంటు కాదని, ప్రసవం నొప్పులు వచ్చే సమయానికి ఆరోగ్యం స్థిరంగానే ఉందని తెలిపారు. అయితే హార్ట్ బీట్ కొద్దిగా పెరగడం, ఉమ్మనీరు పోవడం వల్లే ఆమె మృతి చెంది ఉంటారని, ఇటువంటి కేసులు లక్షల్లో ఒకటి సంభవిస్తాయని వెల్లడించారు. వైద్యులు అందుబాటులో లేకే ఆమె మృతి చెందిందని కుటుంబీకులు ఆరోపిస్తున్నారని, అయితే ఆదివారం రాత్రి డ్యూటీ డాక్టర్ ఆదిలక్ష్మి గర్భిణి లక్ష్మిని పరీక్షించారని తెలిపారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఐటిడిఎ పిఒ సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ

విచారణకు ఆదేశించిన ఐటిడిఎ పిఒ

విషయం తెలుసుకున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ సోమవారం ఏరియా ఆసుపత్రికి చేరుకొని మృతురాలి భర్త తెల్లం వెంకన్న దొరతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ గర్భిణి లక్ష్మి మృతిపై పూర్తిస్థాయి విచారణకు సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీని నియమించినట్లు చెప్పారు. ఈ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్, పిడియాటిస్ట్ పోస్టులు కొరత ఉందని, వాటిని భర్తీ చేయాలని రాష్ట్ర ఫ్యామిటీ హెల్త్ కమిషనర్‌కు తెలియజేశామని చెప్పారు. ఉన్న గైనకాలజిస్ట్ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండే విధంగా తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యమే కారణం..

- సిపిఎం ప్రాంతీయ కన్వీనర్ మట్ల వాణిశ్రీ

రంపచోడవరం : వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఏరియా ఆసుపత్రిలో నిండుగర్భిణి తెల్లం లక్ష్మి మృతి చెందిందని, ఇది బాధాకరమని సీపీఎం రంపచోడవరం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ పేర్కొన్నారు. సోమవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ లక్ష్మిని ప్రసవం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి ఆశా వర్కర్ సహాయంతో ఈ నెల 19న తీసుకొచ్చారని తెలిపారు. 23న సిజేరియన్ ఆపరేషన్ చేసి బిడ్డని తీస్తామని చెప్పిన అక్కడి వైద్యాధికారులు నిర్లక్ష్యం చేశారని, 26న చేస్తామని మరోసారి, 28న చేస్తామని మూడో సారి చెప్పి చేయలేదని తెలిపారు. చివరికి 29న అర్ధరాత్రి దాటిన తరువాత లక్ష్మి పురుటి నొప్పులతో బాధపడుతుండగా, ఆ సమయంలో గైనకాలజిస్ట్‌లు అందుబాటులో లేకపోవడంతోనే లక్ష్మితో పాటు ఆమె కడుపులో ఉన్నా బిడ్డ చనిపోయినట్లు పేర్కొన్నారు.

ఏరియా ఆసుపత్రిలోనే గర్భిణికి సుఖ ప్రసవం చేయలేని అధికారులు లోతట్టు గ్రామాల్లో ఉన్నా గిరిజనులకు ఏమీ వైద్యం అందిస్తారని ప్రశ్నించారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో గిరిజనులకు వైద్యం అందని ద్రాక్షగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 24 గంటలు అందుబాటులో ఉండాల్సిన వైద్యులు కూడా అందుబాటులో లేకుండా నిర్లక్ష్యం చేయటంపైనా, జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ స్పందించి గర్భిణి, కడుపులో బిడ్డ మృతిపైనా క్షేత్ర స్థాయి విచారణ చేసి, నిర్లక్ష్యపు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 24 గంటలూ ఆసుపత్రి సూపరింటెండెంట్ పర్యవేక్షణ ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని, మరో సారి ఇలా సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వాణిశ్రీ కోరారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-విఆర్.పురం : ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని జెడ్‌పిటిసి వాళ్ల రంగారెడ్డి అన్నారు. మండలంలోని రేఖపల్లి పంచాయతీలో సర్పంచ్ పూనెం సరోజిని అధ్యక్షతన సోమవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈసందర్భంగా జడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారుల బృందం ప్రతి రెవెన్యూ గ్రామాన్ని సందర్శించి సదస్సులు నిర్వహిస్తుందని చెప్పారు. భూ యజమానులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసా కమిటీ ఉపాధ్యక్షులు సారా పాండురాజు, కార్యదర్శి వేటగాని సూరి, ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి, ఉప సర్పంచ్ లక్ష్మణరావు, తహశీల్దారు సరస్వతి, ఆర్ఐ రామకృష్ణ, వీఆర్వో సుగుణ, అటవీ శాఖ, సచివాలయం సిబ్బంది, సిపిఎం మండల కార్యవర్గ సభ్యులు పంకు, సత్తిబాబు, పోడియం శ్రీరామ్మూర్తి, నాయకులు చీరపు తాతబాబు, గుండుపూడి లక్ష్మణరావు, పాల్గొన్నారు.

సీలేరు : పట్టాలు మార్పిడి చేసుకోవాలంటే దరఖాస్తులు చేసుకోవాలని డిప్యూటీ తాసిల్దార్ డి.సత్యనారాయణ తెలిపారు. జీకే వీధి మండలం దారకొండలో సర్పంచ్ నడిగట్ల రాజు అధ్యక్షత సోమవారం రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిటి మాట్లాడుతూ తండ్రి చనిపోతే కుమారుల పేరున, భర్త చనిపోతే భార్య పేరున పట్టాలు మార్చుకోవడానికి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాడి రామన్న, సిపిఐ నాయకులు సంకర విష్ణుమూర్తి, కూటమి నాయకులు, విఆర్వోలు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విఆర్.పురం జెడ్‌పిటిసి వాళ్ల రంగారెడ్డి


రామారావుకు పరామర్శిస్తున్న నాయకులు

సిపిఎం నేత రామారావుకు మాతృవియోగం

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని తడిగిరి వైస్ సర్పంచ్, సీపీఎం మండల నాయకులు కిల్లో రామారావు మాతృమూర్తి కిల్లో రాజమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ విశాఖ కేజీ హెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు, వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, సీపీఎం నాయకులు హైమావతి, మండల కార్యదర్శి వలసనైని లక్ష్మణరావు, ఉప్పల కొండా పడల్, పాంగి సోమన్న, సీదరి మత్స్యేష్, ఎండిఎం మండల అధ్యక్షుడు బుజ్జిబాబులు ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జి.మాడుగుల: జి.మాడుగుల గాంధీ నగర్ జిబిటిజ్బిఎ బాలికల పాఠశాలను ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు సందర్శించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ, గిరిజన పాఠశాలల్లో అత్యాచారాలు వంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిరిజన ప్రాంతంలో ఉన్న పాఠశాలలో తరుచూగా జరుగుతున్న సంఘటనలపై దృష్టి పెట్టాలని కోరారు.


బిసిజి వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య కేంద్రం సిబ్బంది

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - హుకుంపేట: కొంతిలి గ్రామంలో టీబీ వ్యాధిపై సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాధన మాట్లాడుతూ, టీబీ వ్యాధిని అరికట్టేందుకు బీసీజీ వ్యాక్సినేషన్ వేసుకోవాలన్నారు. టీబీ వ్యాధి ఒకరి నుండి ఒకరికి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీబీ పర్యవేక్షకులు .సదానందం, ఫీల్డ్ కోఆర్డినేటర్ .ధనరాజు, ఎఎన్ఎంలు విజయలక్ష్మి, రత్నకుమారి ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను శిక్షించాలి



మాట్లాడుతున్న ఐద్వా మండల అధ్యక్షులు ఈశ్వరి

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : ఇటీవల మహిళలు, బాలికలు తరుచు సామూహిక అత్యాచారాలకు గురవుతున్నారని, వాటిని అరికట్టే విధంగా కూటమి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఆదివాసి గిరిజన మహిళా సంఘం (ఐద్వా)మండల అధ్యక్షురాలు సోనియా ఈశ్వరి కోరారు. సోమవారం పుట్టు గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ అఘాయిత్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించ లని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జి.మాడుగుల మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న బాలికను మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడటం దుర్మార్గమన్నారు. ఈ అఘాయిత్యానికి పాల్పడిన వారికి ఉరి శిక్ష విధించే విధంగా కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మణి, శాంతమ్మ, గౌరమ్మ, సత్యవతి, దేవి పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి-చింతపల్లి: నూతన సంవత్సర వేడుకలలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని చింతపల్లి ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. నూతన సంవత్సర వేడుకలను జరుపుకునేవారు రాత్రి సమయంలో ఇంట్లోనే ఉండి వారి కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలన్నారు. రోడ్లపై పోలీసుల అనుమతులు లేకుండా నూతన సంవత్సర వేడుకలను మైకులు పెట్టి నిర్వహించినా, మద్యం సేవించి వాహనాలపై సంచరించినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి ఎవరైనా అల్లర్లకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. హోటల్స్, రెస్టారెంట్స్, రిసార్ట్ నిర్వాహకులు డీజే సౌండ్స్, అశ్లీల నృత్యాలు వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.మండల ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

సైన్స్‌పై అవగాహనకు ప్రభుత్వ పాఠశాలల్లో గీతం ప్రాజెక్టు

ప్రజాశక్తి-మధురవాడ : శాస్త్ర విజ్ఞానం పట్ల పాఠశాల స్థాయి విద్యార్థులలో అవగాహన పెంచడంతో పాటు నూతన ఆలోచనలను రేకెత్తించే విధంగా సైన్స్ ప్రయోగాలను ప్రభుత్వ పాఠశాలలో చేసి చూపించడానికి భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజి కమ్యూనికేషన్ (ఎన్‌సిఎస్‌టిసి) సహకారంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం "లెట్ అజ్ డు సైన్స్" పేరిట ప్రత్యేక ప్రాజెక్టును అమలు చేస్తోంది. జిల్లా విద్యాశాఖతో కలిసి ఆనందపురం, నరవ, చంద్రంపాలెం, చింతల అగ్రహారంలోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో వారంరోజులుగా వివిధ కార్యక్రమాలను చేపట్టినట్లు ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్ డాక్టర్ బి.స్పందన తెలిపారు. త్వరలో ఉన్నత పాఠశాలల అధ్యాపకులకు సైన్స్ వర్క్‌షాప్‌లను, పాఠశాలలలో సైన్స్ ఎగ్జిబిషన్‌లు, విద్యార్థులకు నూతన ఆలోచనలపై పోటీలను నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులో సహ ఇన్వెస్టిగేటర్లుగా ఇంజినీరింగ్, సైన్స్ కళాశాలలకు చెందిన డాక్టర్ వివికె.లక్ష్మి, డాక్టర్ కె.నవీన్‌కుమార్, డాక్టర్ కె.ఆదర్శకుమార్, డాక్టర్ పి.కనకరాజు వ్యవహరిస్తున్నారని వివరించారు.

విద్యార్థులలో ఆసక్తి పెంచేలా కార్యక్రమాల రూపకల్పన

ఈ ప్రాజెక్టులో భాగంగా పాఠశాల విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తి పెంచడానికి ప్రాజెక్టు నిపుణులు సరికొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. ఇళ్లలో ఉపయోగించే మిక్సర్, వాషింగ్ మిషన్, ఫ్యాన్, హీటర్, క్యాలికులేటర్ ఎలా పనిచేస్తాయో వాటి వెనక ఉపయోగించే శాస్త్ర విజ్ఞానం వివరిస్తూ


సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. నిత్య జీవతంలో రక్తం నమూనాలను పరిశీలించడం, వివిధ రకాల పరీక్షలు, వ్యాధి నిర్ధారణ వంటి అంశాలను తెలియజేస్తున్నారు. వీటితో పాటు సూర్య గ్రహణం, చంద్రగ్రహణం ఏర్పడే విధానం వంటి అంశాలతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో డ్రోన్‌లు ఎగిరే సాంకేతికత, రోబోలు పనిచేసే తీరు వంటివి విద్యార్థులకు ఆసక్తికరంగా వివరిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో గీతం ఇంజినీరింగ్, సైన్స్ విభాగాల ప్రొఫెసర్లతో పాటు సైన్స్ ఎడ్యుకేటర్లను, పీజీ విద్యను అభ్యసిస్తున్న గీతం విద్యార్థులను భాగస్వాములను చేశారు.

నెట్‌బాల్ ఎయు పురుషుల జట్టు ఎంపిక

పజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రా యూనివర్సిటీ పురుషుల నెట్‌బాల్ జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులను ఎయు దురవిద్యాకేంద్ర డైరెక్టర్ ఆచార్య ఎన్. విజయ్ మోహన్ అభినందించారు. ఈ పోటీలు రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో జనవరి 3 నుంచి 5వ తేదీ వరకు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నెట్‌బాల్ పురుషుల విభాగంలో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషష్ ఎవిఎస్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ గోపీకృష్ణ, ఎయు వ్యాయామ విద్యా విభాగం అతిథి ఫ్యాకల్టీ డాక్టర్ దిలీప్ కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు: ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పోస్టులు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. హేమలతాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. పారా మెడికల్, సపోర్టింగ్ స్టాఫ్ విభాగంలో 29 క్యాటగిరిలలో మొత్తం 244 పోస్టులు భర్తీ చేస్తామని, అందులో కాంట్రాక్ట్ పోస్టులు 107, ఔట్సోర్సింగ్ పోస్ట్‌లు 137 ఉన్నాయని ఆమె వివరించారు. పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలలో దరఖాస్తులు ఈనెల డిసెంబర్ 31 నుండి జనవరి 10వ తేదీ 2025 వరకు ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటలు వరకు స్వీకరించబడునని ఆమె తెలిపారు. మరిన్ని పూర్తి వివరాల కొరకు వెబ్సైట్లో సంప్రదించ వచ్చని ఆమె సూచించారు.

శీతాకాలం ఆహార జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-ఆరిలోవ : శీతాకాలంలో ఆహారం విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని సీనియర్ కన్సల్టెంట్ ఫిజిషియన్, డయాబెటాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ శ్రీనివాసన్ సూచించారు. శీతాకాలంలో ఎక్కడ నొప్పి పుట్టినా, దెబ్బ తగిలినా తొందరగా తగ్గకపోవడానికి కారణం చలిలో బ్యాక్టీరియా పెరుగుదల ఎక్కువగా ఉండడమేనని తెలిపారు. తినే ఆహారం వల్ల శరీరం మార్పులకు గురవుతూ ఉంటుందని, మధుమేహం ఉన్న వారికి ఈ కాలం ఇబ్బందిగా ఉంటుందని పేర్కొన్నారు. ఒంటి నొప్పులు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. శీతాకాలంలో చింతపండుతో చేసిన పుల్లని పదార్థాలు ఎక్కువగా తినకపోవడం మంచిదని పేర్కొన్నారు. చలికి భయపడి ఏ పని చేయకుండా ఎక్కువగా ఇంట్లోనే ఉండిపోకూడదని, కొద్దిసేపైనా తాజా గాలి ఇంట్లోకి వచ్చేలా చూసుకోవాలని వివరించారు. ఉదయాన్నే కాసేపు వ్యాయామం చేయాలని, మోకాలు, నడుం నొప్పులు ఎక్కువగా ఉన్నవారు ఎక్కువ సమయం చేయకూడదని తెలిపారు. ఇంట్లో ఎక్కువగా ఉండే వారు కొంతసేపు ఎండలో నడవడం మంచిదని పేర్కొన్నారు. శీతాకాలంలో కూల్ డ్రిక్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. రాత్రి వేళల్లో పనిచేసేవారు చేతులకు గ్లౌజులు, వెచ్చదనం ఇచ్చే దుస్తులు వాడడం మంచిదని వివరించారు. ఎక్కువ చలి ఉంటే రక్త ప్రసరణ మీద ప్రభావం పడే ప్రమాదం ఉందని తెలిపారు. రక్త ప్రసరణ సరిగ్గా జరగాలంటే వాకింగ్, జాగింగ్ తదితర వ్యాయామం చేయడం మంచిదని పేర్కొన్నారు. శీతాకాలంలో దుంప కూరలకు దూరంగా ఉండడం మంచిదని వివరించారు. సిట్రజ్ జాతికి చెందిన ఆరెంజ్ పండ్లు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవడం ఆరోగ్యకరమని తెలిపారు. నొప్పులుంటే కొద్దిగా కొబ్బరి నూనెను వేడిచేసి మర్దనా చేసుకొని గోరువెచ్చని నీటితో స్నానం చేస్తే ఉపశమనం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కాలంలో వెల్లుల్లి ఎక్కువగా తీసుకోవడం మంచిదని తెలిపారు. సిట్రజ్ జాతికి చెందిన ఆరెంజ్ పండ్లు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవడం ఆరోగ్యకరమని తెలిపారు. నొప్పులుంటే కొద్దిగా కొబ్బరి నూనెను వేడిచేసి మర్దనా చేసుకొని గోరువెచ్చని నీటితో స్నానం చేస్తే ఉపశమనం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కాలంలో వెల్లుల్లి ఎక్కువగా తీసుకోవడం మంచిదని తెలిపారు. టీ, కాఫీలకు బదులు లెమన్, గ్రీన్ టీ తీసుకోవచ్చని పేర్కొన్నారు.

మాతా, శిశు మరణాలను నివారించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లాలో మాతృ, శిశు మరణాలను నివారించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో సోమవారం మాతృ, శిశు మరణాలపై జగదీశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రానగర్, బాలాజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో చెరొక మాతృ మరణాలు సంభవించాయని తెలిపారు. పెదగంట్యాడ, శొంఠ్యాం, రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో చెరొక శిశు మరణాలు సంభవించాయని చెప్పారు. గర్భిణిగా నమోగైనప్పటి నుంచి ప్రసవించే వరకు, ప్రసవానంతర సేవలు సక్రమంగా అందేలా చూడాలని పిహెచ్‌సి వైద్యాధికారులు, ఎఎన్ఎంలను ఆదేశించారు. శిశువులకు అన్ని వ్యాధి నిరోధక టీకాలూ సమయానికి అందజేయాలన్నారు. ఈ సమీక్షలో డాక్టర్లు ఉషాప్రసాద్, గిరిధర్, షర్మిలాకుమారి, శ్రావణ్, ప్రవీణ్, జి.రాజేష్, సంబంధిత ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొరపల్లిలో షూటింగ్ సందడి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పాండురంగ పంచాయతీ పరిధి కొరపల్లి గ్రామంలో రెండు రోజులుగా ఫ్యాన్ ఇండియా చిత్రం షూటింగ్ జరుగుతోంది. ఈ సినిమాకు నిర్మాతగా అదే గ్రామానికి చెందిన రాజా సాగి సత్యనారాయణరాజు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఈయన నిర్మాతగా మూడు చిత్రాలను చిత్రీకరించారు. చిత్రానికి హీరోయిన్‌గా హారిక నటిస్తున్నారని, పల్లెటూరు కథ ఇతివృత్తంగా చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు నిర్మాత తెలిపారు.


వినతులు స్వీకరిస్తున్న పిఒ, సబ్ కలెక్టర్

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - రంపచోడవరం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పిఒ సింహాచలంతో పాటు సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ, ఏపీవో జనరల్ డిఎన్వి రమణ ప్రజలను అర్జీలు స్వీకరించారు. 45 దరఖాస్తులు వచ్చినట్లు పిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.విజయశాంతి, డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి ఆర్ఎం డాక్టర్ వెంకట ఇందిరా, ఎడియంహెచ్ఒ జి.శిరీష, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సుబ్బయ్య, రవికుమార్, డిఎల్‌డిఒ కోటేశ్వరరావు, గాబ్రియేలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద రైతు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - అనకాపల్లి : కలెక్టర్ కార్యాలయం, రెవెన్యూ అధికారుల వద్దకు ఏడాదిగా తిరుగుతున్నా తన సమస్యలు పరిష్కారం కాకపోవడంతో సోమవారం అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుని బంధువుల కథనం మేరకు.. మాకవరపాలెం మండలం తూటిపాల గ్రామానికి చెందిన రైతు అనిమిరెడ్డి రమణ తన ఇంటితో పాటు భూ రికార్డులు, ఇతర కాగితాలు కాలిపోవడంతో రేకుల షెడ్ వేసుకొని ఆ గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఆ షెడ్‌కు కరెంట్ మీటరు ఇవ్వాలని, భూ రికార్డులు, రేషన్ కార్డు, ఇతర కాగితాలు ఇవ్వాలని సంవత్సర కాలం నుంచి జిల్లా కలెక్టర్, స్థానిక రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. తన సమస్యను ఎవ్వరూ పరిష్కరించకపోవడంతో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. వెంటనే ఆయన్ని బంధువులు అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది.

సిపిఎం నాయకుల పరామర్శ

రైతు ఆత్మహత్యాయత్నం విషయం తెలియడంతో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్ ఆసుపత్రికి వెళ్లారు. చికిత్స పొందుతున్న రైతు రమణను పరామర్శించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ ప్రభుత్వాధికారులు సకాలంలో స్పందించకపోవడంతో రమణ ఆత్మహత్యకు పాల్పడ్డారని, ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఆయనకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బాధిత రైతుకు ఏదైనా జరిగితే దానికి జిల్లా అధికారులు, ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

దేవరాపల్లి : రమణ ఆత్మహత్యాయత్నానికి అధికారుల తీరే కారణమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న తెలిపారు. సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

జీతాలు చెల్లించకపోవడం అన్యాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నాలుగు నెలలుగా స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వేతనాలను చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే న్యాయం చేయాలంటూ స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొండా తౌడన్న, బయ్యే మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఉక్కు ఉద్యోగులు అర్ధాకలితో బతుకుతున్నారని తెలిపారు. సుమారు 150 మంది ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు సంతకాలు చేసిన గ్రీవెన్స్ ఫిర్యాదును సమర్పించారు. వెంటనే ఈ విషయం మీద జోక్యం చేసుకుని స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పరిశ్రమల్లో ప్రమాదాల దడ

భద్రత డొల్లతనం
రక్షణ చర్యలు నామమాత్రం
రాని కొత్త పరిశ్రమలు
స్థానికులకు ఉపాధి లేమి

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని ఔషధ, రసాయన పరిశ్రమల్లో భద్రత, రక్షణ చర్యల్లేమితో ప్రమాదాలు ఈ ఏడాది పాటు కొనసాగాయి. కార్మికులు, ఉద్యోగుల్లో భయానక వాతావరణం నెలకొంది. పరిశ్రమాధిపతులు ప్రమాదాల నియంత్రణకు కనీస జాగ్రత్తలు తీసుకోలేదు. పరిశ్రమ ప్రమాణాలు పాటించలేదు. ప్రభుత్వమూ భద్రతపై శ్రద్ధ చూపలేదు. కార్మికుల ప్రాణాలకు విలువ ఇవ్వలేదు. తమ లోపాలతో జరిగిన ప్రమాదాలకు బాధ్యులైన పరిశ్రమాధిపతులపై కఠిన చర్యలు తీసుకోలేదు. వారిపై అత్యంత ఉదారంగా వ్యవహరించింది. ప్రభుత్వమే యజమానులను వెనుకేసుకురావడంతో ప్రభుత్వ యంత్రాంగం అచేతనంగా తయారైంది. అసెన్షియా ఫార్మా ప్రమాదంలో 17 మంది కార్మికులు చనిపోయి, 38 మంది గాయపడ్డారు. అయినా యాజమాన్య ప్రతినిధులపై సరైన చర్యలు లేవు. ఈ ఘటన తరువాత సినర్జిన్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడ్డ నలుగురు కార్మికులు మృతి చెందారు. ఠాగూర్‌లో ఇద్దరు చనిపోయారు. విజయశ్రీ, రక్షిత్ ఫార్మాలో ఇటీవల జరిగిన ప్రమాదాల్లో కార్మికుల ఆస్పత్రులపాలయ్యారు.

జిల్లాలో పరిశ్రమలు భయాన్ని సృష్టించాయి తప్ప ఆత్మస్థైర్యాన్ని కల్పించలేకపోయాయి. నిర్వాసితులు, స్థానికులకు పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు కల్పించాలన్న జిఓ అమలుకునోచుకోలేదు. ఈ ఏడాది చెప్పుకోదగిన కొత్త పెట్టుబడులు, పరిశ్రమలు రాలేదు. కాకినాడ ప్రాంతంలో ప్రజలు పోరాడి ప్రతిఘటించిన బల్క్ డ్రగ్ పార్కును నక్కపల్లి ప్రాంతంలోని 2001 ఎకరాల్లో ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధపడుతోంది. ఇప్పటికే రసాయన పరిశ్రమలతో నిండిన తీరంలో మరిన్ని రసాయన పరిశ్రమలు ఏర్పాటుకానుండడంతో మత్స్యకారుల తమ జీవనోపాధిపై తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారు. సముద్రంలో చేపల వేటకు దూరమవుతామని ఆందోళన చెందుతున్నారు. మత్స్యకారులు, తీర ప్రాంత ప్రజల బాధలు, సమస్యలు ఆనాడు వైసిపి, ఈనాడు కూటమి ప్రభుత్వంలోని టిడిపి, జనసేన, బిజెపికి పట్టడంలేదు. పర్యావరణ ప్రమాదంలేని వ్యవసాయాధారిత పరిశ్రమలు కంటే రసాయన పరిశ్రమలకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయి. ప్రభుత్వరంగ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే క్రమంలో నక్కపల్లి ప్రాంతంలో ప్రయివేటు మిట్టల్ స్టీల్ ఏర్పాటవుతుందని నమ్మబలుకుతుంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించాలని అడగని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశ్రమ ఏర్పాటుకాని మిట్టల్‌కు గనులు కేటాయించాలని ప్రధాని మోడీని కోరి ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాలను దెబ్బతీయడానికి సిద్ధపడ్డారు. వేలాది ఉద్యోగాలు వస్తాయని నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారు. జిల్లాలోని భారీ, మధ్య తరహా ప్రయివేటు పరిశ్రమల్లో నిర్వాసిత కుటుంబాలు, విద్యార్హత కల్గిన స్థానిక యువతకు ఉపాధి ఎలా ఎండమావిలా వుందో, మిట్టల్ స్టీల్‌లో కూడా అలాగే వుండబోతుంది. ప్రభుత్వ రంగ పరిశ్రమ వలె మిట్టల్‌లో స్థానిక యువతకు ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత వుండదు. రిజర్వేషన్లు అమలుకావు. కానీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను గొంతుకేసి, ప్రయివేటు మిట్టల్ స్టీల్‌కు ఊపిరిపోయాలని ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వంపై ఒత్తిడి తేలేని స్థానిక ఎమ్మెల్యేలు చివరకు తూలూపి నష్టం తెచ్చిపెడుతున్నారు.


అసెన్షియా ప్రమాదంలో గాయపడ్డ కార్మికులు (ఫైల్ ఫొటో)

పరిశ్రమల్లో తక్కువ జీతాలకు పనిచేసే వలస కార్మికులతో పనిచేయించుకుంటున్న అనుభవాలున్నాయి. భవిష్యత్‌లో ఈ పరిస్థితి కొనసాగేలా ప్రభుత్వ విధానాలున్నాయి తప్ప స్థానికులకు ఉపాధి కల్పించేలా లేవు. ఈ ఏడాది కోడూరులో కొత్తగా 250 సూక్ష్మ, చిన్న,మధ్య తరహా యూనిట్లు నెలకొల్పడానికి ఎపిఐఐసి ప్రయత్నం ప్రారంభించింది. అచ్యుతాపురంలో ఎన్‌టిపిసి ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటుపై ప్రచారమే తప్ప కార్యరూపందాల్చలేదు.

పటిష్ట చర్యలతో నేరాలు తగ్గుముఖం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది చేపట్టిన పటిష్ట చర్యలతో నేరాల సంఖ్య తగ్గిందని సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో 2024 పోలీసు వార్షిక నివేదికను ఆయన వెల్లడించారు. నేర నియంత్రణలో భాగంగా నగర వ్యాప్తంగా 7526 సీసీ కెమెరాలు అమర్చామని, సమస్యాత్మక ప్రాంతాల్లో 1442 లైట్లు ఏర్పాటు చేశామని, 126 నైట్ బీట్ టీంలను రంగంలోకి దించామని తెలిపారు. 272 మందిపై రౌడీ షీట్‌లు తెరిచామన్నారు. 5192 మందిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశామని తెలిపారు. ట్రాఫిక్ విభాగంలో ఎన్నడూ లేని విధంగా 8,72,808 కేసులను నమోదు చేశామని, 4,25,822 కేసులలో చలానాలు విధించామని, 97,090 వాహనాలను సీజ్ చేశామని వెల్లడించారు. ఈ ఏడాది 1094 రోడ్డు ప్రమాదాలను జరిగాయని తెలిపారు. 116 ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదయ్యాయని, 313 ఎన్‌డిపిఎస్ కేసులు నమోదు కాగా 718 మందిని అరెస్టు చేశామన్నారు. 3

64 సైబర్ క్రైమ్ కేసులు నమోదు కాగా 2523 బ్యాంకు అకౌంట్లును సీజ్ చేసినట్టు తెలిపారు. సైబర్ క్రైమ్ కేసుల నియంత్రణకు పలు ప్రాంతాలలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. రూ.4,63 కోట్లును తిరిగి బాధితులు అందించామని అన్నారు. 30 మిస్సింగ్ కేసులను 24 గంటల్లోగా ఛేదించామన్నారు. మీడియా సమావేశంలో పలువురు డిసిపిలు, ఎసిపిలు పాల్గొన్నారు.



నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు

కొమరం లక్ష్మీనారాయణకు ఘన నివాళి

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని అభిచర్ల గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో అమరవీరులు కామ్రేడ్ కొమరం లక్ష్మీనారాయణ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీనారాయణ స్థూపం వద్ద ఆయన చిత్ర పటానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ లక్ష్మీనారాయణ కూనవరం మండలంలోని అనేక ఉద్యమాలు చేశారని తెలిపారు. వ్యవసాయ కార్మికులకు రేట్లు, తునికాకు రేట్ల విషయంలో పోరాటాలు చేసి గిట్టుబాటు ధర, బోనస్ ఇప్పించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య, మండల కార్యదర్శి బాబు బోర్రయ్య, నాయకులు మడెం బాబు, కుటుంబ సభ్యులు కొమరం కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : మద్యం, మాదక ద్రవ్యాలు లేకుండా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని జన విజ్ఞాన వేదిక నాయకులు, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి విశ్వరాజ్ సోమవారం ఒక ప్రకటనలో యువతకు పిలుపునిచ్చారు. ఇటీవల యువత, విద్యార్థులు వేలం వెర్రిగా మద్యం, మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, కుటుంబ సభ్యులకు విషాదం మిగిలిస్తున్నారని తెలిపారు. దయచేసి దుర్వ్యసనాలు మానమని జనవిజ్ఞాన వేదిక కోరుకుంటుందని పేర్కొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి-సీలేరు: జీకే వీధి మండలం దుచ్చరపాలెం, ఏబిలం అంగన్వాడీ కేంద్రాలను సోమవారం జీకే వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి, స్టాక్ రూమను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు కేంద్రాల్లో మంచినీటి సౌకర్యానికి ఎటువంటి సమస్యలు లేవన్నారు. కిచెన్ గార్డెను పెంచడానికి అవకాశం ఉందని కాంపౌండ్ వాళ్ళు మాత్రమే ఆయా కేంద్రాలు లేవని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం మంప పంచాయతీ తుమ్మలబంధ గ్రామానికి చెందిన సెగ్గే మల్లేష్ మృతితో వారి ముగ్గురు పిల్లలు అనాధలుగా మారారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపిటిసి శివరామరాజు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మహేష్ ఈనెల 12న అకాల మరణం చెందగా, ఆయన భార్య 2018లో మృతి చెందిందని, దీంతో వారి పిల్లలు అనాధులుగా మారారని తెలిపారు.

ఛార్జీల భారాన్ని అంగీకరించొద్దు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : 2025- 26కి సంబంధించి డిస్కంలు ప్రతిపాదించిన టారిఫ్, సర్దుబాట్ల ఛార్జీల ప్రతిపాదనలకు అంగీకరించరాదని డిమాండ్ చేస్తూ వార్వా, నివాస్ సంస్థల కార్యదర్శులు బిబి.గణేష్, పిట్టా నారాయణమూర్తి ఎపిఇఆర్‌సికి అభ్యంతరాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు సోమవారం మీడియాతో మాట్లాడుతతూ ఇప్పటికే 2014 -19 వరకు 2022- 23, 2023 - 24 సంవత్సరాలకు సంబంధించిన సర్దుబాటు ఛార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. 2025 - 26కు సంబంధించి రూ.5538.6 కోట్ల మొత్తాన్ని ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల రూపంలో వసూలు చేయాలని డిస్కంలు ప్రతిపాదించాయన్నారు. ఈ ఇంధన సర్దుబాటు ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, వినియోగదారులపై వెయ్యరాదని కోరారు.